వైభవంగా కల్యాణోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు వి.జగదీశ్వర్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు

శేరిలింగంపల్లి: హఫీజ్‌పేట్ అంబేడ్కర్‌నగర్ పోచమ్మ తల్లి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవంను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు వి.జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ధాత్రినాథ్ గౌడ్, మల్లేష్‌గౌడ్, సంజయ్‌గౌడ్, శ్రీనివాస్ కేశవ్, గోపాల్, అశోక్ తేజ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాల్వ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : అభివృద్ధి పనుల్లో జాప్యం వహించరాదని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రూ.45లక్షలతో చేపట్టిన వరదనీటి కాల్వ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, నాయకులు రఘునాథ్ రెడ్డి, అక్బర్ ఖాన్, ఇబ్రహీం, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీకి ఫిర్యాదు

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌కు రాజరాజేశ్వరినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేస్తున్నారని జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ మెహర

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ ఏసీపీగా మెహర గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెస్ట్‌జోన్ ఏసీపీగా పనిచేసిన సాయిబాబా బదిలీపై వెళ్ళగా ఆయన స్థానంలో మెహరాను నియమించారు. శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా రెండేళ్ళకు పైగా పనిచేసి నమెహర కొద్ది నెలల క్రితమే బదిలీ అయ్యారు. తిరిగి జోన్ ఏసీపీగా బదిలీపై రావడం చర్చనీయాంశంగా మారింది. చందానగర్ సర్కిల్‌లో రెండేళ్ళకు పైగా టీపీఎస్‌గా , రెండేళ్ళకు పైగా ఏసీపీగా పనిచేశారు. వెస్ట్‌జోన్ లోనే దాదాపు పదేళ్ల పనిచేశారు.

పారిశుద్ధ్యంపై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న డీసీ

శేరిలింగంపల్లి: స్వచ్ఛఆటోకే ప్రతి ఒక్కరు చెత్త అందించే విధంగా అవగాహన కల్పించాలని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి తెలిపారు. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్‌పై సమీక్షా సమావేశంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలో చెత్త వేయని ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోజు రెండు గంటల పాటు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా గేటెడ్ కమ్యూనిటీల నుంచి వెలువడే ఈ వేస్ట్‌పై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. గార్బేజ్ వనరబుల్ పాయింట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



కేపీహెచ్‌బీకాలనీ: జీహెచ్‌యంసీ కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. విరిగిపడిన చెట్లకొమ్మలు, ఇళ్ల మధ్యలో, ఖాళీ ప్లాట్ల వద్ద పారబోసిన చెత్తా చెదారాన్ని తొలగించారు.

అండర్ పాస్.. అవస్థలెన్నో..

- విస్తరణ జరిగేదెప్పుడు..
- ఏటా వర్షాకాలం తప్పని తిప్పలు
- ఫ్లైఓవర్ల నిర్మాణ నేపథ్యంలో వీటిపై దృష్టి పెట్టాలంటున్న స్థానికులు

చందానగర్: వర్షాకాలం.. కొద్దిపాటి వర్షాలకే అండర్ బ్రిడ్జిల కింద నీరు చేరుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం లింకు రోడ్లు నిర్మించగా మరికొన్ని లింకురోడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కాగా కరోనా సమయంలో శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదురు రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్ఎం మాల్ వరకు లింక్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఆర్టీసీ కాలనీ వద్ద లింక్ రోడ్డు అసంపూర్తిగా ఉంది. కాగా మియాపూర్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల ప్రజలు, ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఐటీ సంస్థలలో పని చేసే ఉద్యోగులు లింగంపల్లి, చందానగర్, వైశాలీనగర్‌ల అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తుంటారు. చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో ఉన్న రైల్వే అండర్ పాస్‌లు ఇరుకుగా మారాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు ట్రాఫిక్ కష్టాలు ఏర్పడుతున్నాయి. ఇక చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఫ్లైఓవర్ పనులు సుమారు 5 సంవత్సరాల నుంచి నిలిచిపోయాయి. అండర్ బ్రిడ్జి విస్తరణతో పాటు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ కష్టాలకు ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు (ఫైల్)

- లింగంపల్లి రైల్వే అండర్‌పాస్‌లో వరద నీరు నిలవకుండా కాలువలు నిర్మించారు. అయినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు.
- వైశాలీనగర్, పాపిరెడ్డికాలనీ (చందానగర్) రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్లను విస్తరించాలి
- వైశాలినగర్–కొండాపూర్‌కు వెళ్లే లింక్ రోడ్డులో రైల్వే అండర్‌పాస్‌లోనే మురుగు కాలువ ఉండడంతో ఒక వాహనం వస్తే మరొక వాహనం ఆగిపోవాలి.
- లింకు రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనాలు అండర్ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి
- ఆర్టీసీ కాలనీ వద్ద అసంపూర్తిగా ఉన్న లింక్ రోడ్డును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలి.
- మూడు అండర్ బ్రిడ్జిల విస్తరణ, ఓ ఫ్లైఓవర్ నిర్మాణంకు కృషి చేయాలి
- ట్రాఫిక్ కష్టాలకు ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలి

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేశాం. చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్ విస్తరణకు ఆదేశాలు జారీ చేశాం.

–ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అండర్‌పాస్ .. వరద నీరు చేరడంతో మూసి వేసిన దృశ్యం (ఫైల్)



శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి జీఎస్ఎం మాల్ వరకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు అసంపూర్తిగా ఉన్న దృశ్యం



వైశాలీనగర్ రైల్వే అండర్ పాస్‌లో ఉన్న మురుగు నీటి పైప్‌లైన్

20న శాంతిసరోవర్‌కు పీఠాధిపతులు, సంత్‌లు రాక

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శాంతిసరోవర్‌కు ఈనెల 20వ తేదీ పలువురు పీఠాధిపతులు, సంత్‌లు రానున్నారు.ఆదివారం ఉదయం 9.30 గంటలకు గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 'సంత్ సమాగమం, దివ్యసమర్పణ– అభినందన వేడుక' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ్ పండితార్థ శివాచార్య మహేష్ స్వామీజీ, అయోధ్యధామ్‌కు చెందిన జగద్గురు రామానుజాచార్య, అయోధ్యధామ్ కామధేను మందిర్ మహామండలేశ్వర్ అశుతోష్‌జీ మహరాజ్, కాకినాడ ప్రణవ ఆశ్రమం స్వామి సుమిత్రానంద సరస్వతి మాతాజీ, ఏలూరు జిల్లా యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి డాక్టర్ కృష్ణచారనంద భారతీ స్వామి, జయ్ భారత్ మూవ్‌మెంట్, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమణమూర్తి, మౌంట్‌అబు బ్రహ్మకుమారీస్ గ్లోబల్ హెడ్‌క్వార్టర్స్ సీనియర్ సభ్యులు రాజయోగిని బికె ఉషాదీదీ, బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ సబ్ జోన్ ఇన్‌చార్జీ రాజయోగిని బికె కుల్‌దీప్ దీదీ పాల్గొంటారు.

10 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 1500, మరో ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇస్నాపూర్ 'యూ–టర్న్' సమస్యను పరిష్కరించండి

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ 'యూ–టర్న్' సమస్యను పరిష్కరించాలని ఎస్ఆర్ కే యువసేన సభ్యులు ట్రాఫిక్ పోలీసులను కోరారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఆర్‌కే యువసేన సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇస్నాపూర్ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో యూటర్న్‌ను ఇస్నాపూర్ శివారు హాస్టల్ దాటాక ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూ–టర్న్ దూరంగా ఉన్న నేపథ్యంలో రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రమాదాలకు, ట్రాఫిక్ చలాన్‌లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌరస్తాకు సమీపంలో యూ–టర్న్‌ను ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ సీఐని కోరారు. ఇస్నాపూర్ ప్రముఖ్‌నగర్ సమీపంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లే విధంగా యూటర్న్ ఏర్పాటు చేస్తామని, సీఐ లాలూనాయక్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు జోగు ధన్‌రాజ్, దీపక్‌గౌడ్, షకీల్, అబ్దుల్, రాము, నవీన్, క్రాంతి, వినయ్ గౌడ్, రవి తేజ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న యువసేన సభ్యులు

ట్రాఫిక్ అడ్డంకులను తొలగించాలి

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్‌బోర్ఖడే



మాట్లాడుతున్న జెడ్సీ హేమంత్‌బోర్ఖడే

గచ్చిబౌలి: వాహనాల రాకపోకలకు అంతరాయంగా ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులను జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్‌బోర్ఖడే ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రధాన రహదారుల వెంట ఫుట్‌పాత్ ఆక్రమణలు, ఫ్లైఓవర్‌ల కింద ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అంతరాయంగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఐటీకారిడార్‌తో పాటు ప్రధాన రహదారుల వెంట ట్రాఫిక్ జామ్ నెలకొంటోందని ఆయా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ ఎస్ఈ శంకర్, ఉపకమిషనర్లు ప్రశాంతి, శశిరేఖ, ఇందిర, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీలో బ్యాడ్మింటన్ కోర్టు సీజ్



గచ్చిబౌలి: జర్నలిస్ట్ కాలనీలో గోపన్‌పల్లి ఫేజ్–3 ప్లాట్ నెంబర్ 25, 26లలో జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా కట్టిన బ్యాడ్మింటన్ కోర్టును జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. అంతేకాకుండా అనుమతి లేకుండా సెల్లార్, సెట్‌బ్యాక్ లేకుండా నాలుగు ఫ్లోర్లు కట్టడంతో సీజ్ చేశారు. ఇంకా ఈ కాలనీలో ఇలాంటి భవనాలు, పార్కింగ్ వదలకుండా ఫుట్‌పాత్‌లపై కార్ల పార్కింగ్ చేస్తున్నారు. 20 ఫీట్ల రోడ్డు వైడనింగ్‌కు 10 ఫీట్ల వదిలి కట్టి పాదచారులు తిరగకుండా ఇరువైపులా గోడ కట్టి దారి మూసేశారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.

కొమరవెల్లి, వర్గల్ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు

మియాపూర్ : ఆర్టీసీ మియాపూర్–2 డిపో పరిధిలో ప్రతి ఆదివారం కొమరవెల్లి, వర్గల్ పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు లింగంపల్లి నుండి బయల్దేరి వర్గల్ శ్రీ సరస్వతి దేవాలయం, కొమరవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం దర్శనానంతరం సాయంత్రం 6 గంటలకు తిరిగి లింగంపల్లి చేరుకుంటుందన్నారు. 30మందికిపైగా ప్రయాణికులుంటే ఏ రోజైనా బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.మరిన్ని వివరాలకు 9059162162,9959226420 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెంకట్ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టెలిగ్రామ్‌నగర్, ఎల్ అండ్ టీ టవర్స్, సాయిబాబా దేవాలయం..

- గచ్చిబౌలి సబ్ స్టేషన్ పరిధిలో మ. 2 గంటల నుంచి సా. 5 గంటల వరకు మహిళా మండలి, గాయత్రి నెస్ట్, ఆర్‌టీటీసీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మంచినీటి నల్లా కనెక్షన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్‌బో మెడోస్ కాలనీలో మంచినీటి నల్లా కనెక్షన్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఐలాపూర్ గ్రామంలో పది లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, శ్రీకాంత్, గోవింద్, కాలనీ అధ్యక్షులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు..



మణికొండ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ట్యాంకర్లు

- మొహం చాటేసిన వరుణుడు
- అడుగంటిన భూగర్భ జలాలతో పనిచేయని బోర్లు
- నీటి కోసం ప్రజల పాట్లు
- పట్టించుకోని అధికారులు



అపార్ట్‌మెంట్ల వద్ద నీటి ట్యాంకరు

మణికొండ: వర్షాకాలం ప్రారంభమై నెల దాటినా వరుణుడు మొహం చాటేయడంతో నీటి కష్టాలు ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. దక్షిణ తెలంగాణలో ఇప్పటి వరకు వర్షం కురవకపోవటంతో సింగూరు, మంజీరా, గండిపేట, హిమాయత్‌సాగర్‌లలోకి చుక్క నీరు చేరలేదు. అలాగే గండిపేట మండల పరిధిలోనూ చెప్పుకోదగ్గ పెద్ద వర్షం కురవక పోవటంతో అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో వేసవిలో వట్టిపోయిన బోర్లు రీచార్జ్ కాలేదు. పాత బోర్ల పరిస్థితి అలా ఉండగా కొత్తగా మరిన్ని బోర్లు ఎండిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జలమండలి నీటి సరఫరాలో సమయం తగ్గించుకుంటూ పోతుండటంతో మండల ప్రజలకు నీటి బాధలు తప్పటం లేదు.

ఎండిపోతున్న బోర్లు...

గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీలలో ఇబ్బడిముబ్బడిగా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు వెలుస్తున్నాయి. నీటి అవసరాలు తీరేలా బోర్లు వేశారు. ఒకటి, రెండు సంవత్సరాలు కాగానే వట్టిపోతున్నాయి. అడుగడుగునా బోర్లు వేయటం లక్షలాది లీటర్ల నీటిని తోడేస్తుండటంతో భూగర్భజలాలు మరింత లోతుకు వెళ్తున్నాయి.

- గండిపేట మండల పరిధిలో భారీ వర్షాలు కురిస్తే 8 నుంచి 10 మీటర్ల లోతులో నీరు లభిస్తుంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు వర్షాలు కురవక పోవటంతో అది కాస్తా ఏకంగా 20 మీటర్ల లోతుకు చేరుకుంది. దాంతో అనేక బోర్లు వట్టిపోతున్నాయి. ప్రజలతోపాటు అటు జలమండలి, ఇటు మున్సిపాలిటీలు ఇంకుడు గుంతల ఏర్పాటును పట్టించుకోకపోవటంతో నీటి కష్టాలు మొదలయ్యాయి.

పట్టించుకోని జలమండలి...

గండిపేట మండల పరిధిలో వస్తున్న కొత్త నిర్మాణాలకు అడిగిన వెంటనే నీటి కనెక్షన్‌లను మంజూరు చేస్తున్న జలమండలి అధికారులు అందుకు అనుగుణంగా గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువుల వద్ద ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేసి నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసి అందించే విషయాన్ని పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. మంజీరా నది నుంచి షేక్‌పేట రిజర్వాయర్ వరకు ఉన్న పైప్‌లైన్ శిథిలావస్థకు చేరి నెలకు ఒకసారైనా పగిలిపోతున్నా సామర్థ్యం పెంచి కొత్త పైప్‌లైన్ వేయాలనే విషయంపై దృష్టి పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న మెయిన్ పైప్‌లైన్‌కే నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కొత్త బల్క్ కనెక్షన్‌లు ఇచ్చి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సామాన్య ప్రజలకు నీటి సరఫరా సమయాన్ని తగ్గిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్లతోనే...

అటు బోర్లు వట్టిపోవటం, ఇటు జలమండలి నీరు తగ్గిపోతుండటంతో ట్యాంకర్లపై ఆధారపడి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. జలమండలి ద్వారా బుక్ చేసిన ట్యాంకర్ల ఎలాంటి అంతరాయాలు లేనపుడు 24 గంటలలో వస్తుందని, అదే పైప్‌లైన్‌లు పగిలి నీటి సరఫరా నిలిచిన సమయంలో వాటిని సరఫరా చేయలేక అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.

- ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు అదే అదనుగా ఒక్కో ట్యాంకర్‌కు రూ.వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు దండుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా జలమండలి అధికారులు మంజీరా నుంచి కొత్త పైప్‌లైన్ యుద్ధప్రాతిపదికన వేసి స్థానిక అవసరాలకు తగ్గట్టుగా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు కొత్త కనెక్షన్ల మంజూరును ఆపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మొక్కలు, పూలు కోస్తే రూ.1000 జరిమానా




బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

బొటానికల్ గార్డెన్‌లో సందర్శకులకు అధికారుల హెచ్చరిక

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో పూలను కోయడం , మొక్కలను తెంచడం వంటి వాటిని పూర్తిగా నిషేధించారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ తాజాగా ఈ నిర్ణయాన్ని బొటానికల్ గార్డెన్‌లో అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బొటానికల్ గార్డెన్‌లో పలుచోట్ల ఈ హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. బొటానికల్ గార్డెన్‌లో పూలను కోసినా, మొక్కలను విరిచినా రూ.1000 జరిమానా విధిస్తామని బొటానికల్ గార్డెన్ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. బొటానికల్ గార్డెన్ అందాన్ని మరింత పెంచడంతో అందరూ సహకరించాలని ఆయన సూచించారు.

బాలిక అదృశ్యం



మియాపూర్ : బాలిక అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ పర్వీద్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం...బిహార్‌కు చెందిన సల్మా పర్వీనా(11) ఈ నెల 10వ తేదీన బిహార్ నుండి మియాపూర్ ప్రేమ్‌నగర్ కాలనీలో ఉంటున్న చిన్నమ్మ సమీనా ఇంటికి వచ్చింది. 14వ తేదీ బాలిక చిన్నమ్మ సమీనా పనికి వెళ్లగా సల్మా పర్వీనా ఇంటిదగ్గరే ఉండిపోయింది. రాత్రి 8 గంటలకు పని ముగించుకుని సమీనా ఇంటికి వచ్చి చూడగా సల్మా కనిపించలేదు. బాలిక కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక చిన్నమ్మ సమీనా మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.